

మాట్లాడుతున్న మాజీ ఎంపీ వినోద్‌కుమార్

# బ్యాంక్ అకౌంట్ డిటేయిల్స్ ఎందుకు అడుగుతలేరు

- ఆరు గ్యారెంటీల దరఖాస్తుల్లో పేర్కొనలేదెందుకు?
- ఖాతాల వివరాల కోసం మళ్లీ గ్రామ సభలు పెడుతరా..?
- ప్రజల్లో అనేక అనుమానాలున్నాయి..ఆగమైపోతున్నరు
- ప్రభుత్వం వెంటనే క్లారిటీ ఇవ్వాలి • మాజీ ఎంపీ బీ వినోద్ కుమార్

కరీంనగర్ కార్పొరేషన్, జనవరి 2: రాష్ట్ర ప్రభుత్వం అభయహస్తం పేరిట ఆరు గ్యారెంటీల అమలు కోసం స్వీకరిస్తున్న దరఖాస్తు ఫారాల్లో బ్యాంకు అకౌంట్ వివరాలు అడుగకపోవడంపై ప్రజల్లో అనేక అనుమానాలు వ్యక్తమవుతున్నాయని మాజీ ఎంపీ వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కరీంనగర్ క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజాపాలన దరఖాస్తు ఫారంలో బ్యాంకు అకౌంట్ అడగకపోవడంతో ప్రజలు సందేహపడుతున్నారన్నారు. సంక్షేమ పథకాల కోసం ప్రజలు దరఖాస్తు ఫాంతోపాటు ఆధార్ కార్డు, రేషన్ కార్డు జత చేస్తున్నారని, మరి బ్యాంకు అకౌంట్‌నంబర్ గురించి ఎలాంటి సమాచారం అడుగకపోవడంలో అంతర్యమేమిటనన్నారు. బ్యాంకు అకౌంట్ కోసం మళ్లీ గ్రామసభలు నిర్వహిస్తారా..? చెప్పాలని ప్రశ్నించారు. ప్రస్తుతం ఉన్న డిజిటల్ యుగంలో బ్యాంకు అకౌంట్ లేకుండా లబ్ధిదారులకు ఎలా సంక్షేమ పథకాల డబ్బులు చెల్లిస్తారని ప్రశ్నించారు. ప్రభుత్వ తీరుతో ప్రజలు ఆగమవుతున్నారని, దీనిపై స్పందించాలని కోరారు. ఈ సమావేశంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఏనుగు రవీందర్ రెడ్డి, బీఆర్‌ఎస్వీ రాష్ట్ర నాయకులు జక్కుల నాగరాజు, బీఆర్‌ఎస్ నాయకుడు బైరం పద్మయ్య, హైమద్, దూలం సంపత్ గౌడ్, సాయికృష్ణ, వినోద్ పాల్గొన్నారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో హైదరాబాద్‌లో జరిగే సన్నాహక సమావేశంపై సమీక్షిస్తున్న బీఆర్‌ఎస్ నాయకులు, మేయర్ సునీల్‌రావు

# పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్‌ఎస్‌ను గెలిపించాలి

- కరీంనగర్ మేయర్ వై సునీల్‌రావు

కార్పొరేషన్, జనవరి 2: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో కరీంనగర్ నుంచి బీఆర్‌ఎస్ అభ్యర్థి వినోద్‌కుమార్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత పార్టీ శ్రేణులపై ఉన్నదని నగర మేయర్ యాదగిరి సునీల్‌రావు అన్నారు. ఈ నెల 4న హైదరాబాద్‌లో జరిగే కరీంనగర్ పార్లమెంట్ నియోజకవర్గ బీఆర్‌ఎస్ సమావేశానికి సంబంధించి మంగళవారం కరీంనగర్‌లోని ఎమ్మెల్యే కమలాకర్ క్యాంపు కార్యాలయంలో పార్టీ నియోజకవర్గ నేతలతో సమావేశమయ్యారు. 4న జరిగే సమావేశానికి 70 మంది హాజరుకావాలని కోరారు. పార్లమెంట్ ఎన్నికల్లో విజయానికి పక్కా ప్రణాళికతో ముందుకెళ్లాలని నిర్దేశించారు. ఈ సమావేశంలో బీఆర్‌ఎస్ నగరాధ్యక్షుడు చల్ల హరిశంకర్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్, ఎంపీపీ లక్ష్మయ్య, కొత్తపల్లి మున్సిపల్ చైర్మన్ రుద్రరాజు, నాయకులు జమీలొద్దీన్, శ్యాంసుందర్, పిల్లి మహేశ్, సంపత్, రాజేందర్ పాల్గొన్నారు.



### వ్యాపారం విస్తరణ కోసం ఎదురుచూపు

ఇక్కడ కూర్చున్న వారి పేరు తాండ్ర శంకర్, కత్తెరపాక శంకరయ్య. వీరిది వీణవంక మండలం చల్లూరు. అప్పుడు ఇద్దరికి కలిపి ₹10 లక్షలు రాగా, ఒక ఫర్మ్ ఏర్పాటు చేసుకుని చల్లూరులోనే ఆటో మొబైల్ షాపు పెట్టుకున్నారు. 2022 సెప్టెంబర్‌లో యూనిట్ ప్రారంభించుకున్నారు. వ్యాపారంలో వచ్చిన లాభాల నుంచి పైసా పైసా కూడేసుకుని జిరాక్స్ సెంటర్ కూడా పెట్టుకున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు మిగిలిన ₹9.80 లక్షల కోసం అదనపు కొటేషన్‌తోపాటు మిగిన ప్రక్రియ పూర్తి చేశారు. ఈ ఫైల్ ఎంపీడీవో కార్యాలయం నుంచి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయానికి వెళ్లింది. ఇక డబ్బులు వస్తాయనుకునే సమయంలో ఎన్నికల నోటిఫికేషన్ వచ్చింది. దీంతో వీళ్లు తీవ్ర నిరాశ చెందారు. అప్పుడు అధికారులను అడిగితే ఎన్నికల తర్వాత వస్తాయని చెప్పారు. ఇప్పుడు అడిగితే ప్రభుత్వం ఆదేశాలు రాలేదని అంటున్నారు. 'బ్యాంకు ఖాతాల్లో ఉన్న మా డబ్బులు మాకు ఇచ్చేందుకు అధికారులు ముందుకు రావడం లేదు. మానవతా దృక్పథంతోనైనా గత ప్రభుత్వం చేసిన పూర్తి ఆర్థిక సహాయాన్ని అందించాలి' అని వేడుకుంటున్నారు.

# దళితబంధుపై నీలినీడలు!

- పథకం అమలుపై అయోమయం
- సర్కారు మారడంతో అగమ్యగోచరం
- రెండో విడుత అందని ఆర్థిక సాయం
- రావాల్సిన సహాయం ₹258.67 కోట్లు
- పంపిణీపై స్పష్టతనివ్వని అధికారులు
- ఉమ్మడి జిల్లాలో 6,965 మంది లబ్ధిదారుల ఎదురుచూపులు
- వ్యాపారాలు దెబ్బతింటున్నాయని ఆందోళన
- సాయం అందించాలని వేడుకోలు




### షాపుల సామాను లేదు.. ఏంజేయాలో అర్థమయితలేదు

పది నెలల కిందట నాకు దళితబంధు కింద ₹5లక్షలు మంజూరు చేసిన్రు. జమ్మికుంటలో మొబైల్‌షాప్ పెట్టుకున్న. ఫర్నిచర్ కొనుగోలు చేసి మిగిలిన డబ్బులతో ఫోన్లు, ఇతర సామగ్రి కొనుగోలు చేసి విక్రయిస్తున్న. రెండో విడుత డబ్బులు చేతికందే టైంల ఎన్నికల కోడ్ అచ్చింది. ఎలక్షన్లు అయిన తర్వాత కొత్త ప్రభుత్వం ఏర్పాటైంది. వారం పదిరోజుల్ల పైసలు విడుదల జేత్తరని అనుకున్న. కానీ, అధికారుల దగ్గరికి వెళ్లి సరైన సమాధానం ఇవ్వడంలేదు. షాపులో సామాను లేక గిరాకీ మఱ్రిపోతున్నది. ప్రతి నెలా ₹15 వేల కిరాయి మీదవడుతంది. ఏంజేయాలో అర్థమయితలేదు! ప్రభుత్వం వెంటనే దళితబంధు డబ్బులు విడుదల చేసి ఆదుకోవాలె.

- దాసారపు నాగరాజు, దళితబంధు లబ్ధిదారుడు (వీణవంక)

*దళితుల కుటుంబాల్లో వెలుగులు నింపే లక్ష్యంతో కేసీఆర్ సర్కారు 'దళితబంధు'ను తెచ్చింది. మొదటి విడుత 50 శాతానికిపైగా యూనిట్లు అందించి, విజయవంతంగా చెల్లింపులు చేస్తూ వచ్చింది. ఈ ప్రక్రియ కొనసాగుతున్న క్రమంలోనే అసెంబ్లీ ఎన్నికల కోడ్ రావడంతో నిలిపివేయాల్సి వచ్చింది. అయితే ఎన్నికల తర్వాత పథకం యథాతథంగా అమలవుతుందని ఆశించిన లబ్ధిదారులకు నిరాశే మిగులుతున్నది. కొత్త సర్కారు అధికారంలోకి వచ్చి దాదాపు నెల అవుతున్నా.. ఇప్పటివరకు పంపిణీపై ఎలాంటి స్పష్టత లేకపోవడం అయోమయానికి గురి చేస్తున్నది. అధికారులను అడిగినా సరైన సమాధానం రాక ఆందోళన వ్యక్తమవుతున్నది. అయితే దళితబంధు అమలవుతుందా..? లేదా..? అనే దానిపై సందిగ్ధం నెలకొనగా, పథకంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. సాయం అందక తమ వ్యాపారాలు దెబ్బతింటున్నాయని దళితకుటుంబాలు వాపోతున్నాయి. పథకాన్ని కొనసాగించి ప్రభుత్వం తమను ఆదుకోవాలనే డిమాండ్లు వ్యక్తం చేస్తున్నాయి.*

కరీంనగర్, జనవరి 2 (నమస్తే తెలంగాణ) : దళితులను పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దాలనే లక్ష్యంతో తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ దళితబంధు పథకానికి శ్రీకారం చుట్టారు. 2021 ఆగస్టు 15న హుజూరాబాద్ మండలం ఇందిరానగర్-శాలపల్లి వేదికగా ఈ పథకాన్ని ప్రారంభించారు. ఈ పథకం కింద అప్పటి సర్కారు ఒక్కో కుటుంబానికి ₹10 లక్షల ఆర్థిక సాయం అందించింది. హుజూరాబాద్‌ను పైలెట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసి, పథకం అమలు చేసింది. ఈ నియోజకవర్గంలో 18,021 మందికి లబ్ధి చేకూరింది. ఉమ్మడి జిల్లాలోని మిగతా నియోజకవర్గాల్లో రెండు విడుతల్లో దళిత బంధు పథకాన్ని అమలు చేసింది. హుజూరాబాద్ మినహా ఉమ్మడి జిల్లా పరిధిలో 1,020 మందికి వివిధ యూనిట్లు మంజూరు చేసింది. లబ్ధిదారులు వివిధ రంగాలను ఎంచుకుని వ్యాపారాలు చేసుకునేలా ప్రోత్సహించింది. అయితే పథకం అమలుకు యూనిట్లను డెయిరీ, తయారీ, రిటైల్, సేవలు/సరఫరా, రవాణా సెక్టార్లుగా విభజించారు. ఒక్కో యూనిట్‌కు ₹10 లక్షలు మంజూరు చేసి, అందులో ₹10వేలు దళిత రక్షణ నిధి కింద తీసుకుని మిగతా ₹9.90 లక్షలు లబ్ధిదారుల ఖాతాల్లో జమచేశారు. అయితే కొన్ని సెక్టార్లలో లబ్ధిదారులు ఇచ్చిన కొటేషన్లను బట్టి ఒక్కొక్కరికి ₹2 లక్షల నుంచి ₹9.50 లక్షలు ఆపైన విడుదల చేశారు. వీటితో దళితులు వ్యాపారాలు చేసుకుంటున్నారు.

### మిగిలిన సహాయంపై సందిగ్ధత

ప్రస్తుతం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం దళిత బంధు పథకంపై ఇప్పటి వరకు ఎలాంటి స్పష్టత ఇవ్వలేదు. అయితే తమ ఖాతాల్లో ఉన్న మిగిలిన ఆర్థిక సహాయాన్ని విడిపించుకునే అవకాశం ఇవ్వాలని లబ్ధిదారులు అడుగుతున్నారు. దీనికి సంబంధించిన ప్రక్రియ గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే పూర్తి కాగా, అందుకు అవసరమైన ఫొటో క్యాప్చరింగ్‌తోపాటు అదనపు కొటేషన్లు కూడా అధికారులు తీసుకున్నారు. కొన్ని క్లస్టర్ అధికారుల వద్ద, మరికొన్ని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉన్నాయి. ₹5లక్షల నుంచి ₹7,8 లక్షల వరకు ఆర్థిక సహాయం అందాల్సిన వారు వేల సంఖ్యలో ఉన్నారు. ముఖ్యంగా పైలెట్ ప్రాజెక్టుగా తీసుకున్న హుజూరాబాద్‌లో 6,868 మందికి ₹256.76 కోట్లు రావాల్సి ఉంది. ఇదే నియోజకవర్గ పరిధిలోని హన్మకొండ జిల్లా కమలాపూర్ మండలంలో మరో 1,280 మందికి ₹14.83 కోట్లు ఇవ్వాల్సి ఉంది. ఇక ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చూస్తే కరీంనగర్‌లో 210 మందిలో 4, పెద్దపల్లిలో 259 మందిలో మరో 14, సిరిసిల్లలో 206 మందిలో 55, జగిత్యాలలో 345 మందిలో మరో 24 మందికి మిగిలిన ఆర్థిక సహాయం అందాల్సి ఉన్నది. కమలాపూర్ మినహాయిస్తే ఉమ్మడి జిల్లాలో 6,965 మందికి ₹258.67 కోట్లు రావాల్సి ఉంది. ఈ ఆర్థిక సహాయం అందుతుందా..? లేదా..? అనే విషయంలో లబ్ధిదారులు సందిగ్ధంలో పడ్డారు.

### ఆందోళనలో లబ్ధిదారులు

దళితబంధు లబ్ధిదారులు ₹9.90 లక్షలతో తమ వ్యాపార ప్రణాళికలు చేసుకున్నారు. మొదట సాయం అందడంతో వ్యాపారాలు ప్రారంభించారు. ఇప్పుడు మిగిలిన ఆర్థిక సహాయం అందక ఆందోళన చెందుతున్నారు. వీరిలో ఎక్కువగా రిటైల్, రవాణా రంగాలకు సంబంధించిన వారే ఉన్నారు. దుకాణాల్లో సరుకులు నిలిచి పోవడం, తిరిగి తెచ్చుకునే విషయంలో డబ్బులు రొటేషన్ కాక చాలా మంది ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల చుట్టూ తిరుగుతూ తీవ్ర నిరాశకు గురవుతున్నారు. అసలు మిగిలిన డబ్బులు వస్తాయా..? రావా..? అని సందేహిస్తున్నారు. ఈ నేపథ్యంలో దళితులు రోడ్డెక్కుతున్నారు. ఇటీవల జమ్మికుంట తహసీల్ ఆఫీస్ ఎదుట లబ్ధిదారులు ఆందోళన చేశారు. బుధవారం నియోజకవర్గ కేంద్రమైన హుజూరాబాద్‌లో పెద్ద ఎత్తున నిరసన ధర్నా చేసేందుకు సిద్ధమవుతున్నారు.



### లబ్ధిదారులకు న్యాయం జేయాలె

కూలీనాలి జేసుకొనే మా బతుకుల్ల దళితబంధు ఇచ్చి కేసీఆర్ వెలుగులు నింపిండు. అధికారులు ఆరు నెలల కిందట మొదటి విడుత ₹5లక్షలు ఖాతాలో జమ జేసిన్రు. ఈ నగదుతో జమ్మికుంటలోని కాళోజీ రోడ్డులో ఓ షెట్టర్‌ను అద్దెకు తీసుకొని కంగన్‌హాల్ అండ్ జనరల్ స్టోర్ పెట్టుకున్న. గిరాకీ గూడా మంచిగైతున్నది. నలుగు పైసలు కండ్ల జూత్తున్నం. రెండో విడుత డబ్బులు చేతికి వచ్చే టైంల ఎలక్షన్ కోడ్ వచ్చింది. దీంతో నగదు విడుదల కాలేదు. ఎన్నికల తర్వాత సంది ఆఫీసుల చుట్టూ తిరిగినా లాభంలేకుండా పోయింది. కొత్త సర్కారు దళితబంధు కింద సాయం జేత్తదని అనుకున్న. కానీ, గవర్నమెంట్ అచ్చి దగ్గర దగ్గర నెల అయింది. అధికారుల దగ్గరికి పోతే పట్టించుకుంటలేరు. ప్రభుత్వం దళితబంధుపై దృష్టిపెట్టి లబ్ధిదారులకు న్యాయం జేయాలె.

- తిప్పారపు లక్ష్మి, దళితబంధు లబ్ధిదారు, కనపర్తి, (వీణవంక)



### ముందుకుసాగని వ్యాపారం

వీణవంకకు చెందిన ఇతని పేరు దాసారపు స్వామి (శ్యాం). దళితబంధు మొదటి విడత కింద ఇచ్చిన ₹5 లక్షలతో కుట్టు మిషన్ల సేల్స్ అండ్ రిపేర్ షాపు పెట్టుకున్నాడు. తనకు వచ్చిన మొత్తం నుంచి 84 మిషన్లు తెచ్చి విక్రయించాడు. అందులో ఎక్కువగా ఉద్దెర కిందనే విక్రయించాల్సి వచ్చింది. ఇపుడు అమ్మడానికి రెండు మిషన్లు మాత్రమే మిగిలినయ్. మిగతా ₹4.90 లక్షలు వస్తాయనే ఆశతో గోదాం ఉండాలని తాను అద్దెకు ఉన్న ఇంటిని విస్తరించుకున్నడు. కానీ, ఇప్పటివరకు మిగిలిన మొత్తం రాలేదు. చేతిలో డబ్బులు లేకపోవడం, ప్రభుత్వం నుంచి రావల్సిన డబ్బులు రాకపోవడంతో స్వామి వ్యాపారం దెబ్బతిన్నది. మిగిలిన డబ్బులు వస్తాయనే ఆశతో తాను అద్దెకు తీసుకున్న ఇంటికి నెలకు ₹2,500, కరెంట్ బిల్లు మరో ₹500 చెల్లిస్తూ వస్తున్నడు. ఇపుడు ఆ మిగిన డబ్బులు వస్తాయనే ఆశ రోజురోజుకూ సన్నగిల్లుతున్నదని స్వామి వాపోతున్నాడు. తన ఫైల్ ఈడీ కార్యాలయంలో పెండింగ్‌లో ఉందని, వెంటనే మిగిలిన డబ్బులు విడుదల చేయాలని కోరుతున్నాడు.

# సార్వత్రిక పోరుకు బీఆర్‌ఎస్ సన్నద్ధం

- నేటి నుంచి లోక్‌సభ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు
- తెలంగాణ భవన్ వేదికగా ఈ నెల 21 దాకా నిర్వహణ
- ఉత్తర తెలంగాణ స్థానాలపై ప్రధాన దృష్టి
- కార్యాచరణ రూపకల్పనలో నిమగ్నం

*లోక్‌సభ సమరానికి బీఆర్‌ఎస్ సన్నద్ధమతున్నది. మార్చిలోనే ఎన్నికలు ఉండే అవకాశముండగా, దూకుడు పెంచింది. ఇప్పటికే పార్లమెంట్ ఎన్నికలకు సీఈసీ సంకేతాలు ఇవ్వడం, ఓటరు జాబితా సవరణ చేపట్టిన నేపథ్యంలో పార్టీ కార్యాచరణ మొదలుపెట్టింది. అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు నేటి నుంచి హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా సన్నాహక సమావేశాలు నిర్వహించబోతున్నది. ఈ నెల 4న కరీంనగర్, 6న పెద్దపల్లి, 7న నిజామాబాద్ లోక్‌సభ సెగ్మెంట్ల వారీగా దిశానిర్దేశం చేయనుండగా, మెజార్టీ ఎంపీ సీట్లు సాధిస్తామనే ధీమా పార్టీ శ్రేణుల్లో కనిపిస్తున్నది.*



కరీంనగర్, జనవరి 2 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): సార్వత్రిక ఎన్నికల సమయం దగ్గర పడుతున్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ లోక్‌సభ నియోజకవర్గాల వారీగా పార్టీ నాయకులతో సమావేశాలు నిర్వహించాలని నిర్ణయించింది. అందులో భాగంగా పటిష్టమైన కార్యాచరణ రూపొందించడంతోపాటు మెజార్టీ లోక్‌సభ స్థానాలను కైవసం చేసుకోవాలని భావిస్తున్నది. గత అసెంబ్లీ ఎన్నికల్లో స్వల్ప తేడాతో ఓటమి పాలైనప్పటికీ బలమైన ప్రతిపక్ష పాత్రను పోషిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్నది. ఈ పరిస్థితుల్లో లోక్‌సభ ఎన్నికల్లో సత్తా చాటేందుకు బీఆర్‌ఎస్ సిద్ధమవుతున్నది. నేటి నుంచి సన్నాహక సమావేశాలు నిర్వహించబోతున్నది. నేడు ఆదిలాబాద్ లోక్‌సభ నియోజకవర్గంతో సమావేశాలు ప్రారంభించి, ఈనెల 21తో ముగించనున్నది. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అధ్యక్షతన జరిగే ఈ మీటింగ్‌లకు ఆయా లోక్‌సభ నియోజకవర్గాలకు చెందిన ఎంపీలు, ఎమ్మెల్యేలు, మాజీ మంత్రులు, మాజీ ఎమ్మెల్యేలు, మాజీ ఎంపీలు, జడ్పీచైర్మన్లు, మాజీ చైర్మన్లు, వివిధ కార్పొరేషన్ల మాజీ చైర్మన్లు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలు, పార్టీ జిల్లా అధ్యక్షులు పార్టీ ప్రతినిధులతోపాటు ఆయా నియోజకవర్గాలకు చెందిన ముఖ్య నేతలు హాజరుకాబోతున్నారు. తెలంగాణభవన్ వేదికగా మొత్తం రెండు విడుతల్లో 16రోజులపాటు ఈ సమావేశాలు నిర్వహించనున్నారు. సంక్రాంతి పండుగ సందర్భంగా మూడురోజుల విరామం తర్వాత తిరిగి 16 నుంచి 21 వరకు మిగిలిన నియోజకవర్గాల సమావేశాలు జరగనున్నాయి. ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానంతో మొదలై హైదరాబాద్, సికింద్రాబాద్‌తో ముగుస్తాయి.

### పటిష్ట కార్యాచరణ

ఉమ్మడి కరీంనగర్ జిల్లా పరిధిలోని కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల సమావేశాలు మొదటి విడుతలోనే ఉన్నాయి. గత లోక్‌సభ ఎన్నికల్లో పెద్దపల్లి లోక్‌సభ నియోజకవర్గాన్ని బీఆర్‌ఎస్ దక్కించుకోగా, నిజామాబాద్, కరీంనగర్ స్థానాల్లో బీజేపీ విజయం సాధించింది. ఈ సారి ఈ మూడు స్థానాల్లో గులాబీ జెండా ఎగురవేయాలన్న లక్ష్యంతో బీఆర్‌ఎస్ ముందుకుసాగుతున్నది. అయితే ఇటీవలి అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటు కాగా, అతి తక్కువ సమయంలోనే ఆ పార్టీ పాలనపై ప్రజలు పెదవి విరుస్తున్నారు. ఈ పరిస్థితుల్లో కేసీఆర్ సర్కారు చేసిన అభివృద్ధిని మరోసారి కండ్లకు కట్టినట్లుగా వివరించడంతోపాటు పార్లమెంట్‌లో తెలంగాణ గొంతు విప్పాల్సిన ఆవశ్యకత, అందుకు కావాల్సిన బలం, బీఆర్‌ఎస్ అభ్యర్థులు ఎంపీలుగా గెలవాల్సిన అవశ్యకతను నొక్కిచెప్పాలన్న ఆలోచనలో బీఆర్‌ఎస్ నాయకులున్నారు. దీంతోపాటు సన్నాహక సమావేశంలో ఇటీవల అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమికి కారణాలు, వాటిని అధిగమించేందుకు తీసుకోవాల్సిన చర్యలు, ప్రస్తుత లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహం, నాయకుల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని ఒక పటిష్టమైన ప్రణాళిక రూపొందించనున్నారు. ఈ సమావేశాల్లో నిర్ణయించే అంశాలను పరిగణనలోకి తీసుకొని ప్రజల్లోకి వెళ్లేందుకు సిద్ధమవుతున్నారు.

### ఎన్నికల సంఘం సన్నద్ధం

కేంద్ర ఎన్నికల సంఘం లోక్ సభ ఎన్నికల నిర్వహణకు కావాల్సిన అన్ని ఏర్పాట్లను చేస్తున్నది. ఇప్పటికే ఓటరు జాబితా సవరణకు ఆదేశాలు జారీ చేసింది. 2024 జనవరి ఒకటి నాటికి 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది. ఫిబ్రవరి 8న తుది జాబితా ప్రకటించాలని ఇప్పటికే ఆదేశించింది. అంతేకాదు, ప్రతి 1500 ఓటర్లకు ఒక పోలింగ్ కేంద్రం ఉండాలని స్పష్టం చేసింది. ఆ మేరకు అధికారులు రంగంలోకి దిగారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో జరిగిన పొరపాట్లు జరగకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఈ పరిస్థితుల్లోనే అన్ని రాజకీయ పార్టీలు సైతం లోక్‌సభ ఎన్నికలకు సన్నద్ధమవుతున్నాయి. ఉమ్మడి జిల్లా పరిధిలోకి వచ్చే మూడు నియోజకవర్గాల్లో మొత్తం 21 అసెంబ్లీ నియోజకవర్గాలుండగా, 50,18,291 మంది ఓటర్లు ఉన్నారు. అయితే 8న తుది జాబితా ప్రకారం ఈ ఓటర్ల సంఖ్య పెరిగే అవకాశముందని అధికారులు చెబుతున్నారు. ప్రతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో సుమారు 10 నుంచి 12వేలవరకు ఓటర్లు పెరుగుతారని అంచనా వేస్తున్నారు.

**ఉమ్మడి జిల్లాతో సంబంధమున్న కరీంనగర్, పెద్దపల్లి, నిజామాబాద్ లోక్‌సభల పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాలు, ఓటర్ల వివరాలు (సర్వీస్ ఓటర్లతో కలిపి)**

కరీంనగర్ లోక్‌సభ

| నియోజకవర్గం | ఓటర్ల సంఖ్య |
|---|---|
| కరీంనగర్ | 3,55,156 |
| చొప్పదండి | 2,33,188 |
| మానకొండూర్ | 2,21,741 |
| హుజూరాబాద్ | 2,49,722 |
| హుస్నాబాద్ | 2,42,397 |
| సిరిసిల్ల | 2,44,532 |
| వేములవాడ | 2,22,304 |
| మొత్తం | 17,69,040 |

పెద్దపల్లి లోక్‌సభ

| నియోజకవర్గం | ఓటర్ల సంఖ్య |
|---|---|
| పెద్దపల్లి | 2,54,530 |
| రామగుండం | 2,21,232 |
| మంథని | 2,36,597 |
| ధర్మపురి | 2,27,013 |
| మంచిర్యాల | 2,75,141 |
| బెల్లంపల్లి | 1,73,498 |
| చెన్నూర్ | 1,88,417 |
| మొత్తం | 15,76,428 |

నిజామాబాద్ లోక్‌సభ

| నియోజకవర్గం | ఓటర్ల సంఖ్య |
|---|---|
| కోరుట్ల | 2,40,901 |
| జగిత్యాల | 2,31,513 |
| ఆర్మూర్ | 2,10,341 |
| బోధన్ | 2,20,238 |
| నిజామాబాద్ అర్బన్ | 2,94,902 |
| నిజామాబాద్ రూరల్ | 2,53,417 |
| బాల్కొండ | 2,21,511 |
| మొత్తం | 16,72,823 |



కరీంనగర్‌లోని పెట్రోల్ బంకు వద్ద బారులు తీరిన వాహనదారులు

# బంకుల వద్ద బారులు

- పెట్రోల్, డీజిల్ కోసం వాహనదారుల క్యూ
- హైదరాబాద్‌లో ఆయిల్ ట్యాంకర్ యజమానుల సమ్మె ఎఫెక్ట్
- రాత్రి సమ్మె విరమించడంతో అంతా కూల్



ధర్మపురి : పెట్రోల్ బంకు వద్ద క్యూలో ఉంచిన పెట్రోల్ డబ్బాలు

పెట్రోల్ బంకులు కిక్కిరిశాయి. వాహనదారులు ఒక్కసారిగా రావడంతో రద్దీగా మారిపోయాయి. కేంద్రం తీసుకొచ్చిన కొత్త రోడ్డు యాక్సిడెంట్ చట్టం(హిట్ అండ్ రన్)ను నిరసిస్తూ దేశ వ్యాప్త సమ్మెలో భాగంగా ఆయిల్ ట్యాంకర్ల యజమానులు సోమవారం నుంచి హైదరాబాద్‌లో సమ్మెకు దిగారు. అయితే ఎక్కడికక్కడ ఆయిల్ ట్యాంకర్లు నిలిచిపోవడంతో మంగళవారం ఉదయం నుంచే కరీంనగర్ ఉమ్మడి జిల్లాలో చాలా పెట్రోల్ బంకుల్లో నో స్టాక్ బోర్డులు కనిపించాయి. ఈ వార్తలు టీవీల్లో రావడం, వాట్సాప్‌లో చక్కర్లు కొట్టడడంతో వాహనదారులు పెట్రోల్, డీజిల్ కోసం ఫిల్లింగ్ స్టేషన్లకు క్యూ కట్టారు. రాత్రయినా లైన్లల్లో వేచి ఉన్నారు. యాసంగి వరినాట్ల సీజన్ కావడంతో ట్రాక్టర్ల డ్రైవర్లయితే పెద్ద పెద్ద క్యాన్లతో బంకులకు వచ్చి 100 నుంచి 200 లీటర్ల డీజిల్‌ను తీసుకెళ్లడం కనిపించింది. అయితే రాత్రి సమ్మె విరమించినట్లు ప్రకటించగా, అంతా ఊపిరి పీల్చుకున్నారు.

- కరీంనగర్ కార్పొరేషన్/ విద్యానగర్, జనవరి 2

# రోగులకు మెరుగైన వైద్యం అందించాలి

- పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్



ప్రభుత్వ దవాఖానలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్

పెద్దపల్లి టౌన్, జనవరి 2: ప్రభుత్వ దవాఖానల్లో రోగులకు మెరుగైన వైద్యం అందించాలని, వైద్యులు నిత్యం అందుబాటులో ఉండాలని పెద్దపల్లి కలెక్టర్ ముజామ్మిల్ ఖాన్ సూచించారు. మంగళవారం పెద్దపల్లి మాతా శిశు సంక్షేమ దవాఖానను తనిఖీ చేసి, మాట్లాడారు. రాష్ట్రంలో ప్రభుత్వ దవాఖానలు ప్రైవేట్‌కు దీటుగా సేవలందిస్తున్నాయని చెప్పారు. ఈ సందర్భంగా పలువురు పేషెంట్లను దవాఖానలో అందుతున్న సేవల గురించి అడిగి తెలుసుకున్నారు. దవాఖానలో పేషెంట్ల రిజిస్ట్రేషన్ల కోసం అదనపు కౌంటర్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పేషెంట్లు వారి సహాయకులతో సిబ్బంది మంచిగా, సానుకూలంగా మెదలాలని, ఓపికతో మాట్లాడాలని సూచించారు. ఇక్కడ ప్రభుత్వ దవాఖాన డీసీహెచ్‌ఎస్ డాక్టర్ రమాకాంత్, సూపరింటెండెంట్ శౌరయ్య పాల్గొన్నారు.